# డామిట్! కథ...



— కర్రె రామగోపాలరావు

విషమెక్కిన
బుర్రలో
చావు రుచి..

'నేనొచ్చేసరికి ఏ విషయమూ తేల్చు!' అనేసి విసురుగా వెళ్ళిపోయాడు సాల్మన్.

తలుపు గడియపెట్టి మంచంమీద కూర్చుని సిగరెట్ వెలిగించాడు డేవిడ్.

సాల్మన్ విషయం అతడికి చాలా విసుగ్గా వుంది.

ట్రంకు పెట్టెలోంచి నోట్ల కట్టలు తీసి టేబుల్ మీద ఉంచాడు. ఫేన్ గాలికి పచ్చటి నోట్లు హుందాగా తలలూపుతున్నాయి. డేవిడ్ తృప్తిగా చూసుకున్నాడు.

ఆ కట్టల్ని ఆప్యాయంగా స్పృశించాడు.

ఆ డబ్బు కట్టల్ని చూస్తున్నకొద్దీ అతడిలో ఉద్వేగం ఉరకలు వేస్తోంది.

అందులో సగం... అంటే అయిదు లక్షలు సాల్మన్ కివ్వాలి. అదే అతడికి రుచించడం లేదు.

బ్యాంకు దోపిడీ ఇద్దరం కలిసే చేశాం. కానీ అందుకు పకడ్బందీగా ప్లాన్ తయారుచేసింది నేను. అటువంటప్పుడు సాల్మన్‌కి సగం వాటా ఎందుకివ్వాలి? మూడు లక్షలిస్తే చాలు. ఇదీ అతడి వాదన. కానీ సాల్మన్ అందుకు అంగీకరించలేదు.

మూడు సంవత్సరాల్నుండీ ఇద్దరం కలిసే దోపిడీలు చేస్తున్నాం. అందులో చాలాసార్లు నేనే ప్లాన్ వేశాను. అయినా నేను ఎక్కువ మొత్తం అడిగానా? లేదే! మరి ఈ రోజేమిటి కొత్తగా! ఇది సాల్మన్ వాదన.

సాల్మన్ చెప్పింది నిజమే. కానీ అంతకు ముందు చేసిన దోపిడీలలో పెద్దమొత్తం పాతిక వేలు. ఈసారి అంకె లక్షల్లోకి మారింది. అందుకే ఆశ కూడా అందలం ఎక్కుతోంది. ఏం చెయ్యాలి?

మరో సిగరెట్ వెలిగించాడు.

సాల్మన్ వచ్చేలోపు ఏ విషయమూ నిర్ణయించాలి. అవును నిర్ణయించాలి. దోపిడీ చేసి నెల దాటుతోంది. ఇంతకాలమూ పెద్దగా గొడవ చెయ్యలేదు సాల్మన్. కానీ ఈ రోజు ఎటూ తేల్చకపోతే వూరుకోడు.

సాల్మన్ పశుబలం ముందు తాను నిలబడ

లేనని డేవిడ్‌కి తెలుసు.

'పారిపోతే?'

ఎక్కడికి.... ఎక్కడికి పారిపోవాలి? పారిపోవడమంటూ జరిగితే ఇంత డబ్బుతో కొత్త చోటుకి వెళ్తే ప్రమాదం. పాత చోటుకే పోవాలి. కానీ సాల్మన్‌కి తెలీకుండా తనకు మాత్రమే తెలిసిన పాతచోటు ఏది?... ఏదీలేదు. అటువంటప్పుడు సాల్మన్ తనని క్షణాల్లో పట్టుకుంటాడు. పోనీ ముందు సాల్మన్‌ని చంపి, తర్వాత పారిపోతే?

ఇది వచ్చిందతడికి. ఎలా చంపాలి?

చాకుతోనా? పిస్టల్ తోనా?

పిస్టలే నయం. తన పిస్టల్‌కి సైలెన్సర్ కూడా వుంది.

ఊహూ... ఏదైనా పొరపాటు జరిగితే ముందు నేను మిగల్ను.

సులువైన మార్గం ఆలోచించాలి. వెంటనే అతడికి ఛార్లెస్ గుర్తు కొచ్చాడు. ఎప్పుడైనా యాసిడ్ లాంటివి అవసరమైతే అతడి దగ్గరకే వెళ్తుంటాడు డేవిడ్.

లేచి నిలబడ్డాడు. జేబులు తడుముకున్నాడు. ఇరవై రూపాయలకంటే ఎక్కువ లేవు. టేబిల్ మీద కట్టల్లోంచి ఒకటి తీసి, కొన్ని నోట్లు జేబులో కుక్కుకున్నాడు.

ఆ కట్టల్ని అలానే ఉంచి, తలుపుకి తాళం వేసి బయటపడ్డాడు.

చల్లటి గాలి అతడ్ని చుట్టుముట్టింది. జేబులో చేతులుంచుకుని నడుస్తున్నాడు. ఆ మురికివాడలో వీధి దీపాలు వెలగడం లేదు.

'అనుకున్న పని సక్రమంగా జరిగితే ఈ రాత్రికే ఊరు విడిచి వెళ్ళిపోవాలి. ఎక్కడికైనా దూరంగా... చాలా దూరంగా... స్వర్గపు అంచులు చూడాలి. థాయ్‌లో అమ్మాయిలు గొప్ప సుఖాన్ని ఇస్తారట. ఒకసారి అక్కడికెళ్ళాలి.'

డేవిడ్‌ని చూడగానే సాదరంగా ఆహ్వానించాడు ఛార్లెస్.

'ఏం కావాలి?' అడిగాడు ఛార్లెస్.

అయిదు పచ్చనోట్లు అతడి చేతిలో వుంచి చెప్పాడు డేవిడ్ 'సైనైడ్ కావాలి'.

'సైనైడా?' ఉలిక్కిపాటుగా చూశాడు ఛార్లెస్.

మరో అయిదు పచ్చనోట్లు అందించాడు డేవిడ్.

వైన్ షాపులో విస్కీబాటిల్ కొన్నాడు. వెళ్తూ పేంట్ జేబు తడుముకున్నాడు. సైనైడ్ సీసా భద్రంగా వుంది.

కానీ అతడు వూహించనిది అతడి వెనుక జరుగుతోంది.

బ్యాంకు దోపిడీ జరిగిన వెంటనే నగరంలోని బార్ల, వైన్ షాపుల యజమానులందరికీ దోపిడీ జరిగిన నోట్ల నెంబర్లు ఇవ్వడం, ఆ నెంబర్లున్న నోట్లు కనిపించగానే తమకి తెలియపరచమని పోలీస్ డిపార్ట్‌మెంట్ నుంచి ఆదేశాలు జారీచేయడం జరిగింది.

డేవిడ్ అటు వెళ్ళగానే ఆ వైన్‌షాపు యజమాని దగ్గర్లో వున్న పోలీస్ స్టేషన్‌కి రింగ్ చేశాడు. వాళ్ళు వచ్చేసరికి ఆలస్యమౌతుందేమోనని షాపులో కుర్రాణ్ణి డేవిడ్‌ని ఫాలో చెయ్యమని పంపాడు.

డేవిడ్ గదిలోకి వెళ్ళి తలుపు వేసుకున్నాక ఆ కుర్రాడు వెనుదిరిగాడు.

టేబుల్ మీద నోట్ల కట్టల్ని ఒక పక్కకి సర్ది, రెండు గ్లాసులు, విస్కీ బాటిల్ అక్కడ పెట్టాడు.

బాటిల్ ఓపెన్ చేసి గ్లాసులోకి ఒంపుకుని తాగడం మొదలుపెట్టాడు. గత రాత్రి మిగిలిన జీడిపప్పు తీశాడు.

అతడు రెండో రౌండ్‌లో ఉండగా తలుపు మీద కొట్టిన చప్పుడయింది.

చేతిలో గ్లాసు పక్కనపెట్టి, సైనైడ్ సీసా తీసి సాల్మన్ గ్లాసు అంచులకి జాగ్రత్తగా సైనైడ్ రాశాడు. కసిగా నవ్వుకున్నాడు.

తన గ్లాసు చేతిలోకి తీసుకొని తలుపు తీశాడు.

సాల్మన్ లోపలి కొస్తూనే అడిగాడు, 'ఏం చేశావ్?'

డేవిడ్ ఏదో అనేలోపే తనకోసం వుంచిన గ్లాసులోకి విస్కీ ఒంపుకున్నాడు సాల్మన్.

డేవిడ్‌కి ఎందుకో అప్రయత్నంగా దడ మొదలైంది.

నుదురు మీద స్వేదం అల్లుకుంటోంది.

సాల్మన్ విస్కీగ్లాసు నోటి దగ్గరకు తెచ్చుకుంటున్నాడు.

అప్పటికే పోలీస్ ఇన్‌స్పెక్టర్ వైన్‌షాప్ కుర్రాడితో ఆ వీధిలోకి ప్రవేశించాడు.

సాల్మన్ రెండే రెండు గుక్కలు వేశాడు. బాధగా అరుస్తూ గొంతు పట్టుకున్నాడు. క్షణాల్లో అతడి శరీరం నీలి రంగులోకి మారిపోయింది. అలాగే కుర్చీలోకి వాలిపోయాడు.

సాల్మన్ శవం వంకా, నోట్ల వంకా మార్చి మార్చి వెర్రిగా చూసుకున్నాడు డేవిడ్. గ్లాసులో మిగిలివున్న విస్కీని గొంతులోకి ఒంపుకుని, సిగరెట్ కోసం చూశాడు. తన దగ్గర లేవు.

సాల్మన్ షర్ట్ జేబులోంచి సిగరెట్ పెట్టె కనిపిస్తోంది.

తీసి చూశాడు. రెండే సిగరెట్లు వున్నాయి.

అప్పటికే ఇన్‌స్పెక్టర్ డేవిడ్ గదికి చాలా సమీపంగా వచ్చాడు.

ఆ రెండు సిగరెట్లలో ఒకటి పెన్‌తో మార్క్ చేయబడి వుంది. అది గమనించకుండా అదే సిగరెట్‌ని పెదాల మధ్య ఉంచుకున్నాడు డేవిడ్.

లైటర్‌తో వెలిగించి గట్టిగా దమ్ములాగాడు. సిగరెట్ అంచుకి తగిలిన నాలుకకి ఏదో తగిలింది.

'ఏవిటి అదోలా వుంది?' అనుకునే లోపే ఆ విష పదార్థం అతడి శరీరం మీద తన ప్రభావాన్ని చూపించడం మొదలు పెట్టింది.

విషయం అతడికి అర్థమైంది. 'డామిట్! కథ అడ్డం తిరిగింది' అతడు గొణుగుతూండగానే శరీరం వాలిపోయింది.

ఆఖరి శ్వాస తీసుకొనే ముందు లీలగా వినిపించిందతడికి బూట్ల శబ్దం.


రుచికరమైన 19 రకాలలో లభ్యం కాగలవు.




ఇంట్లో తయారు చేసినట్లు రుచి. తయారుచేసుకునే శ్రమే లేదు.